


# ఇది చీకటి భూతం కథ

బొల్లిముంత నాగేశ్వరరావు

"ఏమండీ! నే చెప్తే విన్నారు కాదు. కొత్త చోటు వద్దు బాబూ, అక్కడే ఉందామంటే ఏనుగు మీద వాన కురిసినట్టు ఏమైనా పట్టించుకున్నారా, పాడా! బయట తిరగటానికే భయంగా ఉంది. ఇదిగో ఈ మూల నిలబడండి . . ." రమణమ్మ భయంగా పిలిచింది. సాంబిరెడ్డి వెళ్ళి నిలబడ్డాడు.

'బొంవ్ . . .బొంవ్ . . . .బొంవ్ . . .' సాగదీసినట్టు ఒకటే శబ్దం. ఒక్కసారి దగ్గర్లో ఎక్కడో ఫెటేల్‌మన్న ధ్వని. తాటా కొకటి గిరగిరా తిరుగుతూ తమ ముందుగా వెళ్ళిపోయింది.

సాంబిరెడ్డికి ముచ్చెమటలు పట్టాయి. రమణమ్మ వణకటం మొదలేసింది. ఇద్దరికీ భయం వేసి ఇంట్లోకి పోయారు. పెద్ద కూతురు వనజ పాలు కాస్తూ . . . .

"ఏంటమ్మా..." తల్లిదండ్రుల వాలకం అర్థం కాక ఆశ్చర్యంగా అడిగింది.

చెప్పవద్దన్నట్టు సాంబిరెడ్డి సైగ చేశాడు.

"ఏం లేదే తల్లీ. . . ." రమణమ్మ తడబడే గొంతుతో సాగదీసింది. ఈలోగా పాలు పొంగి పొయ్యి పాలయ్యాయి. వనజ వెంటనే కాసిని నీళ్ళు చల్లింది.

రయ్‌మంటూ తలుపు పడదోసుకువచ్చిన గాలికి గూటిలో దీపం పెటీమని ఆరిపోయింది.

చీకట్లో మొచ్చుమీద మెరుస్తున్న రెండు కళ్ళు ఒక దూలం మీద నుంచి మరో దూలం మీదికి దూకాయి. అటకమీద దాచిన గొడ్డలి ఒక్కసారి సాంబిరెడ్డి వీపుకు కొట్టుకుంది. సాంబిరెడ్డి ఒక్కసారి 'అబ్బా' అన్నాడు. రమణమ్మ కెవ్వుమని అరిచింది. అర్థంకాని ఆ పరిస్థితికి తత్తరపడి వనజ వెంటనే బుడ్డి వెలిగించింది.

రమణమ్మ కింద కుప్పగా కూలిపోయింది. బుడ్డి వెలుతురులో తనపైన పడ్డ గొడ్డల్ని చూసి సాంబిరెడ్డి మరింత వణికిపోయాడు. అమ్మ అలా నేల

మీద విరుచుకుపడటంతో వనజ — 'అమ్మా' అంటూ బిగ్గరగా అరుస్తూ లేవదీయబోయింది.

రమణమ్మ శరీరమంతా చెమటలు పట్టి మనిషి జావకారిపోతుంది. చూపులు అదో రకంగా ఉన్నాయి.

"ఇదేమిటే, అమ్మా... నాన్నా . . . ఎవరినైనా తీసుకురావే.'' వనజ భయంగా ఏడవటం మొదలేసింది.

"ఏమేవ్....ఏమేవ్!'' సాంబిరెడ్డి భార్యను పలుకరించాడు. ఆమె పలుకలేదు.

వెంటనే పై ఉత్తరీయాన్ని వేసుకుని బయటకు వచ్చాడు. భోరుమంటున్న గాలి.

'బొంవ్—బొంవ్'— సాగతీస్తున్నట్టు అదే శబ్దం. ఆయనకు కాళ్ళు వణికాయి.

'ఎవరినితీసుకురావాలి!' ఆయన మనసు భయంతో ప్రశ్నించుకుంది. గొడ్డలి చిన్నది కావటమూ, అది తిరగబడి పడటమూ మూలాన తనకు పెద్దగా దెబ్బ తగల్లేదు. నెత్తిమీదే గనుక పడి ఉంటే . . . .

సాంబిరెడ్డి నడుస్తూ మరింత భయపడిపోయాడు.

'తప్పకుండా ఇదేదో గాలి చేష్ట ...' ఆయనకు శరీరం గగుర్పొడిచింది.

సాంబిరెడ్డి మనసులో నూకాలయ్య మెదిలాడు.

• • • •

సాంబిరెడ్డికి ఐదెకరాలపొలంఉంది. వ్యవసాయానికి ఒక బండీ, రెండు దున్నపోతులూ ఉన్నాయి. ఇటీవలే అన్న నుంచి వేరుపడ్డాడు.

మొన్నటి వరకు తమది సమిష్టి కుటుంబం. వూరు మధ్య రామాలయం వెనక ఉన్న ఆరు సెంట్ల స్థలంలోనూ చాలీచాలని రెండు దూలాల పెంకుటిల్లు! ఎవరు బయటికి పోవాలా అని ఇప్పటి వరకూ అలాగే నెట్టుకొచ్చారు. చివరికి సాంబిరెడ్డే బయటికి పోవటానికి నిశ్చయించుకున్నాడు.

అన్న వీరారెడ్డికి నలుగురు పిల్లలు. తనకైతే ఇద్దరే. ఆరుసెంట్లనీ రెండు భాగాలు చేసినా ఎవరికీ చాలని స్థితి. తనే వైదొలగటం మంచిదనుకున్నాడు. చుట్టూ ఉన్నవాళ్ళు కూడా అదే మంచిదన్నారు.

"పెద్దవాడు—నలుగురు పిల్లలు. వాడినేం కష్టపెడతావ్. నువ్వే ఎక్కడైనా స్థలం కొని వేరే వేసుకో . . . .''

పదిమంది అలాగే అనేసరికి సాంబిరెడ్డికి తప్పలేదు.

తమ తూములూరు గ్రామం అంత పెద్దది కాదు. కానీ ఎదుగుతున్న వూరు. వూరుకు ఉత్తర దిశలో మాత్రమే మెట్టభూము లున్నాయి. తక్కిన దిశల్లో మాగాణి.

సెంటు నాలుగైదు వందలు పెడితే తప్ప ఆ మెట్ట భూమి దొరకటం లేదు. ఇటీవలే ఐదు సెంట్ల స్థలం కొనుక్కుని రెండు దూలాల రెల్లుగడ్డి ఇంటిని కట్టుకున్నాడు.

వూరుకు ఇల్లు చివరైనా పెద్ద పెడగా ఉన్నట్టనిపించదు. ఇల్లు పూర్తయ్యే సరికి సాంబిరెడ్డికి ఏడెనిమిది వేల రూపాయలదాకా ఖర్చయింది. గోడలు రాయి, సున్నంతో కట్టుకున్నాడు. నేలమీద నాపరాయి పరిచాడు. వెదురు బొంగులు కాస్త గట్టిగా ఉండేవే వేసుకున్నాడు. చేమెల్లాగా ఏదైనా రేవు

ఆయన నిర్ణయం.

గృహ ప్రవేశం చేసి పదిరోజు లయ్యింది.

ఇంటికి ముందుగా ఉత్తరం దిశకు ఒక డొంక పోతుంది. అది నేరుగా శ్మశానంకేసి దారితీస్తుంది. వూరులో ముసలీ, ముతకా ఎవరు హరీమన్నా అటు తీసుకు పోవాల్సిందే.

చేరిన మూడోనాడే ఎవరో ముసలమ్మను తీసుకు పోయారు. రమణమ్మ అప్పుడే గోల చేసింది.

'ఇదేంచోటు, బాబూ! నాకు భయమేస్తుంది.'

సాంబిరెడ్డి నవ్వి చెప్పాడు. 'ఎందుకే భయం. ఇప్పు డేమయ్యిందని. ముసలివాళ్ళు చనిపోకుండా ఉంటారా...తీసుకుపోకుండా ఉంటారా?'

'అది కాదండీ...శ్మశానానికి మనిల్లేకదా దగ్గర'.

'అయితే ఏం అవుతుంది.'

'. . . . . .'

'పిచ్చి పిచ్చి భయాల్ని పెట్టుకోకు. చనిపోయిన వాళ్ళు బూడిదవుతారు. అంతకంటే మరేం ఉండదు.'

అయినా రమణమ్మ తృప్తిపడలేదు.

కొడుకు పట్నంలో డిగ్రీ చదువుతున్నాడు. పేరు ఉమేష్. ఇంట్లోకి చేరాక రెండు రోజు లుండి మరలా వెళ్ళిపోయాడు.

ఉమేష్ కా ఇల్లు ఎంతగానో నచ్చింది. గాలి, వెలుతురు విశాలంగా ఉండే ప్రాంతం. చుట్టూ పూలచెట్లు పెంచమని వనజకు సలహా ఇచ్చిపోయాడు.

## 2

నూకాలయ్యను వెంటబెట్టుకొచ్చేసరికి రమణమ్మ కొద్దిగా కోలుకొంది. మనిషిలో భయం తగ్గలేదు. పిచ్చిగా చూస్తూ వనజను కూడా భయపెట్టింది.

నూకాలయ్య మనిషి లావుగా ఉంటాడు. కుండ బొర్ర ముందుకు కనిపిస్తుంది. జుట్టు వెనక గిరజాల్లా వ్రేలాడుతుంటుంది. వెడల్పయిన ముఖంలో ముక్కు కూడా వెడల్పుగానే ఉంటుంది. మనిషి వయసుతోపాటు మీసాలు కూడా తెల్లబడ్డాయి. లావుగా ఉన్న బుగ్గలు ముఖానికి కాస్త గంభీరతను తెచ్చిపెట్టాయి. పత్తి పూవుల్లా ఉన్న కళ్ళు, అవి చూసే తీరు —ఎదుటి వాళ్ళకు భయాన్ని కలిగిస్తాయి. బారుగా, వెడల్పుగా ఉండే కుంకుమ బొట్టు అతని కో ప్రత్యేకతను సంతరించిపెట్టింది.

చేతిలో ఉండే కొంకె కర్రకు రాగి రేకు పన్నులు చుట్టబడ్డాయి. దానికి పై భాగంలో రెండు చిరు మువ్వలు అమర్చబడ్డాయి. నూకాలయ్య తన బొంగురు కంఠంతో మాట్లాడుతూ వాటిని లయబద్ధంగా మ్రోగిస్తుంటాడు.

బయటికి కదిలేప్పుడు మందంగా ఉండే పంచెను కడతాడు. మోకాళ్ళను దాటే లాల్చీ ధరిస్తాడు. ఎర్రగా ఉండే ఉత్తరీయాన్ని భుజాన వేసుకుంటాడు.

'నన్ను చూసి భూతాలు పారిపోతయ్యయ్యా! వాటితో స్వయంగా మాట్లాడతాను. అవి దేనికీ లొంగవు. మంత్రదండానికే లొంగుతయ్. మంచి గేదెకో దెబ్బ, మంచి మనిషి కో మాట, మంచి భూతానికో మంత్రమూ చాలు. ఒక మంత్రంతో లొంగకపోయిందో మరో మంత్రం. వాటిని లొంగదీసుకుని అవసరమైతే పనులు కూడా చేయించు కుంటాను.

మన వూరు చివర సుబ్బరావుడు లేడూ. వాడికి పట్టిన దయ్యాన్ని వదిలించటానికి ఎంతో శ్రమ పడాల్సి వచ్చిందిలే. దాని తగలడ—అది కాస్త లావుగా, పొట్టిగా ఉండే దయ్యం. దాన్ని కంట్రోలు చేసి ఇంట్లోనుంచి పంపటానికి నా తలప్రాణం తోక్కి వచ్చిందంటే నమ్మ. అదొక పట్టాన మాట వినలేదు. కసరగానే నవ్వేది. కొడితే ఏడ్చేది. చివరికి జుట్టు చేత్తో పట్టుకుని ఏటి ఒడ్డుకు లాక్కుపోవాల్సి వచ్చింది. అక్కడ పాతేశానుపకో... ముండ ఏ మేడిపించింది. అంతకుముందు ఎందరినో పట్టింది. సుబ్బారావుణ్ణి పట్టేవరకూ దాన్ని గురించి నాకు తెలీదు.

అదీగాక ఇప్పుడు భూతాలు కొత్తరూపాల్ని తీసుకుంటున్నాయి. పాత రోగాలుపోయి మనుషుల కిప్పుడు కొత్త రోగాలొస్తున్నట్టు అవీ కొత్త అవతారా లెత్తుతున్నాయి.

అసలు విషయానికొస్తే మన దేశం భూత వైద్యులు చాలా గొప్ప వాళ్ళయ్యా. విదేశాల వాళ్ళు ఏం కనిపెట్టి ఏడ్చారు. మహా కనిపెడితే ఒక రైలు కనిపెట్టారు. ఒక కరెంటు కనిపెట్టారు. ఒక విమానం కనిపెట్టారు.

మనవాళ్ళు భూతాల్ని కనిపెట్టి, విరుగుడుగా మంత్రాల్ని కూడా కనిపెట్టారయ్యా. ఏదీ... ఎవరినైనా నా ముందుకు పోటీకి రమ్మను. ఒక్క మంత్రాం వేశానంటే విరగతీసుకు పడిపోవాల్సిందే.'

నూకాలయ్య ఆవిధంగా గంటల తరబడి చెప్పుకు పోతుంటాడు. వినేవాళ్ళు నోర్లు తెరిచి అలాగే ఉండిపోయేవారు. ఒకొక్క సమయంలో అతని మాటల తీరుకూ, ముఖంలోని భయం కొలిపే కదలికలకూ భీతి చెందేవారు.

సాంబిరెడ్డి విషయం మొత్తంగా వివరించాడు. శబ్దం వినిపించే చోటుకు తీసుకుపోయాడు. శబ్దంలో మార్పు లేదు.

బోంవ్—బోంవ్—బోంవ్.

మరలా ఫెటేల్‌మన్న ధ్వని. అర్థం తెలీనిదేదో వాళ్ళ ముందుగా కదిలిపోయింది. సాంబిరెడ్డికి మరి కాస్త భయం వేసింది. ప్రక్కనే నూకాలయ్య ఉండటంతో కాస్త కుదుట పడ్డాడు.

నూకాలయ్య ఆ శబ్దాన్ని కాస్సేపు గమనించాడు. తర్వాత ఒక్కసారి పెద్దగా వికటంగా నవ్వాడు.

"ఆః... దొరికావే. నన్ను తప్పించుకుని పోతా. సాంబిరెడ్డిని కాదు ఏడిపించటం. నీ జుట్టు పట్టుకుని లాక్కెలతాను.'

నూకాలయ్య అరవగానే—

బయట గాలి పెద్దగా వీచింది. ఈ సారి శబ్దం మరింతగా భొంవ్ భొంవ్ భొంవ్.

ఎక్కడో ఫెటేల్ మన్న శబ్దం. ఎండుటాకులు వాళ్ళ ముందు గా ఎగిరి పోయాయి.

నూకాలయ్య మరలా నవ్వాడు.

'ఏమిటే. అంత ఖర్మ ఉందా నీకు? సాంబిరెడ్డి

ఒక్క మనిషి—మొన్ననేపాపం కొత్తగా ఇల్లు కట్టు కున్నాడు. తేలిగ్గా వదిలెయ్.''

బయట మరలా ఢొంవ్ ఢొంవ్ ఢొంవ్.

"సాంబిరెడ్డి! వింటున్నావుటయ్యా దాని ఊగ తరగ. ఆ భాష నా ఒక్కడికే తెలుసయ్యా. మరలా ఏమం టుందో తెలుసా? అలా తేలిగ్గా వదిలెయ్యదంట. కొత్తగా ఇల్లు గట్టావు గనుక తన వంతు తనకు చెల్లాలంట.''

"ఎంత ఖర్చు ఉంటుందంటారు?'' సాంబిరెడ్డి నీరసంగా అడిగాడు.

"ఏమే ముండా! చెప్పేడుత్. ముందు ను వ్వా చూరు మీదినుంచి దిగిరా.'' నూకాలయ్య బిగ్గరగా కేక పెట్టాడు. ఆ చీకట్లో ఒక్కసారి పై నుంచి ఏదో దూకినట్టు భూమి అదిరింది. నూకాలయ్య చేతిలోనిక్ర రచివరిమువ్వలు ఘల్లు ఘల్లు మన్నాయి.

నూకాలయ్య ఎగిరి ఒక్కసారిగా చూరు దగ్గరకు పరిగెత్తాడు. ఇదంతా లోపం నుంచి గమనిస్తున్న తల్లి కూతురు భయంతో వణకటం మొదలేశారు.

నూకాలయ్య చూరు దగ్గిరికి పోయి దేన్నో గట్టిగా పట్టుకున్నాడు. ఆ చీకట్లో అర్థం కాకుండా పెనుగులాడాడు.

నూకాలయ్యకు చివరి కేదో పట్టు దొరికింది. మరలా పెద్దగా నవ్వాడు.

"ఆ. ఇప్పుడు వినవయ్యా,సాంబిరెడ్డి! ఈ ముండ నోరు మూశాను. శబ్దం వినిపిస్తుందా?'' అంటూ అడిగాడు.

సాంబిరెడ్డి చెవులు రిక్కించి గమనించాడు. ఇప్పుడుశబ్దం లేదు. నూకాలయ్య కున్న ఆ సామర్థ్యం ఆయనకు ఆశ్చర్యాన్ని కలుగ జేసింది. తనను ఏడిపించిన భూతం ఆయన చేతికి చిక్కినందుకు మనసు కుదుట పడింది.

నూకాలయ్యే రాకపోతే తన నిలాగే ఒక గొడ్డలో, పలుగో విసిరి చంపేసేది. దయ్యాల్ని గుప్పిట్లో పెట్టుకున్న నూకాలయ్య ఒక విధంగా దేవుడితో సమానం.

సాంబిరెడ్డి మనసు కృతజ్ఞతతో చలించింది. నూకాలయ్యకు చేతులెత్తి దండం పెట్టాలనిపించింది.

భూతం నూకాలయ్య చేతికి దొరికిందనేసరికి ఇంట్లో తల్లీ, కూతురుకూడా సంబర పడ్డారు. రమణమ్మకు నీరసం పోయి ఉత్సాహం వచ్చింది.

నూకాలయ్య చెప్పటం మొదలేశాడు.

"ముండ మంచి బలం గలదయ్యా. దీని కెక్కడ లేనిశక్తి ఉన్నట్టు తోస్తుంది. మన వూరిది కాదు. బయటినుంచి తగలడింది. దీన్ని తీసుకెళ్ళి పాతెయ్యా లంటే పెద్ద తతంగమే జరగాలి. ముందు దీని రక్త దాహం తీర్చాలి. కోళ్ళు, మేకల ఖర్చు ఉంటుంది. దీన్ని బయటికి తీసుకుపోయే తతంగంలో ఒక వెయ్యి రూపాయలు సమర్పించు కోవాల్సి ఉంటుంది''. అంటూ మరలా ఒక్కసరి ఎగిరి గంతేశాడు.

ఎక్కడో పెళ్ మన్న ధ్వనీ, మరలా ఢొంవ్ ఢొంవ్‌మనే శబ్దము రాసాగాయి.

"ముండ జారిపోయిందయ్యా!అయినా ఈ రాత్రి మిమ్మల్నేం చేయదు. మంత్రమేసి పోతాను. తలుపు వేసుకుని ఇంట్లో కాలం గడిపెయ్యండి. అప్పు డప్పుడు శ్రద్ధగా వింటే లోపలికూ్కడా శబ్దం వినిపిస్తుంది. ఏం భయపడవద్దు. లోపలికి రాలేదిక'' అంటూ సాంబిరెడ్డి వైపుకి తిరిగిడు. సాంబిరెడ్డి మనసులో కలిగిన ఉత్సాహం కాస్తా నీళ్ళు కారి పోయింది. మంత్రమేసి వెళ్తా నంటున్నాడు కాబట్టి మరలా మనసు కాస్త కుదుట పడింది.

వెంటనే ఇంట్లోకి పోయి ఒక ఏభై రూపాయిలు తెచ్చి, "ఇప్పటి కివి ఉంచండి. ఆ మంత్రమేదో కాస్త గట్టిగా వేసి పొండి. రేపటినుంచీ తమరు చేయ మన్నటు చేద్దాం'' అన్నాడు.

"అక్కర్లేదు,సాంబిరెడ్డీ! ఈ మాత్రం దానికేనా. అయినా, డబ్బులు నా కెందుకూ?'' నూకాలయ్య డబ్బు తీసుకోవటానికి నిరాకరించాడు. సాంబిరెడ్డి బలవంతంగా చేతిలో పెట్టాడు. నూకాలయ్యకు తీసుకోక తప్పలేదు.

వాకిట్లో కూర్చుని పసు పూ, దారమూ తీసుకు రమ్మన్నాడు. వనజ తీసుకొచ్చి ఇచ్చింది.

పసుపు తడిపి దారానికి వ్రాశాడు. ఆ దారాన్ని ముడులు వేస్తూ అర్థం కాని మంత్రమేదో వేశాడు. మంత్రం పూర్తయ్యేసరికి ముడులు పూర్తి అయ్యాయి. ఆ దారాన్ని గడ్డకు పై భాగంలో దర్వాజాకు ముడేశాడు.

"కోడిగుడ్లేమన్నా ఉన్నాయా?'' అంటూ అడిగాడు.


అలనాటి చరిత్రలు ఈనాటి మేటి నవలలు



శ్రీ ప్రసాద్ రచనలు
(విజయ సీరియల్స్)

విజయనగర పతనం–1 — 13.00
విజయ నగర పతనం–2 — 12.00
షాజహాన్ — 13.00
సామ్రాట్ శ్రీరంగరాయ — 10.00
లకుమాదేవి (లల్లాదేవి రచన ఆంధ్రభూమి సీరియల్) — 15.00
ఆర్య చాణక్య — 13.50
అప్పాజీ — 12.00
యుగంధర్ — 13.50
రోషనార — 10.00



* అన్ని బుక్ షాపుల్లోనూ దొరుకుతాయి. దొరక్కపోతే కోరిన పుస్తకాల విలువలో ఒక రూపాయి తగ్గించి M.O. పంపితే మిగిలిన మొత్తానికి V.P.లు పంపుతాము!

నవజ్యోతి పబ్లికేషన్స్
ఏలూరు రోడ్, విజయవాడ-520 002

వనజ ఉన్నాయని చెప్పింది.

"ముందు ఆకలి తీర్చాలి. ఉన్నయన్నీ పట్టుకు రండి'' అన్నాడు. వనజ ఆరు గుడ్లు పట్టుకు వచ్చింది. ఆరింటినీ తీసుకుని మాకాలయ్య బయటికి పోయాడు. ఆ చీకట్లో ఇంటి మీదుగా వాటిని విసిరి వేశాడు. తరవాత సాంబిరెడ్డితో అన్నాడు—

'సాంబిరెడ్డీ! ఆ గుడ్లు ఇంటిమీదుగా పోయే సరికి చిన్న చిన్న విభూది ఉండలుగా మారతయ్. తెల్లవారగానే అటు పోయి చూడు. గుడ్లు మింగింది కాబట్టి ఈ రాత్రికేం భయముండదు. అక్కడే పడి ఉంటుంది. మంత్రమేశా కాబట్టి లోనికి రాలేదు. మరి నేను వస్తాను. తలుపు వేసుకోం'డన్నాడు.

మాకాలయ్య పోగానే సాంబిరెడ్డి కుటుంబం తలుపుల్ని బిడాయించి లోపల నడుములు వాల్చారు.

ఎవరికీ సరిగా నిద్రపట్టలేదు.

## 3

తెల్లవారింది. వెలుగులో ఆ ఇంట్లో బరువుగా ఉండే హృదయాలు తేలిక పడ్డాయి. సాంబిరెడ్డి, రమణమ్మ ఇంటి వెనక్కిపోయి వెదికారు. వారికి చిన్న చిన్న విభూది గడ్డలు నాలుగైదు కని పించాయి.

ఒకరి ముఖా లొకరు ఆశ్చర్యంగా చూసుకున్నారు. భూతం గుడ్లను ఆరగించటం, అవి విభూది గడ్డలుగా మారటం వారికి వింతగా కనిపించింది. మాకాలయ్య ఆ విషయాన్ని ముందుగానే చెప్పి నందుకు ఆయన వారికి మరింత గొప్పగా కని పించాడు.

'ఇంకా నయం. త్వరపడి మీరు ఆయన్ను తీసుకు రావటం మంచిదయ్యింది. లేకుంటే మన గతి ఏమయ్యేదో...ఈ దయ్యాలచోటుకు మనం చేరాల్సి వచ్చింది. మీ అన్నకేం... పూరుమధు హాయిగా ఉంటున్నాడు. దొంగల భయం లేదు. దయ్యాల భయంలేదు. మనకే పట్టిం దీ ఖర్మ. పోయి ఆ మాకాలయ్య కాళ్ళా వేళ్ళాబడి ఆ చెయ్యించేదేదో చెయ్యించండి.'' రమణమ్మ అంది.

సాంబిరెడ్డి ఆలోచనలో పడ్డాడు.

మాకాలయ్య కోళ్ళనీ, మేకపోతునీ, వెయ్యిరూపాయిల్ని ఖర్చు చెప్పాడు. మొన్న మినుములమ్మినై కొడుకు కాలేజీ చదువుకీ ఏడాది సరిపోతాయను కున్నాడు. ఉన్న రెండు రాళ్ళూ ఇల్లు కట్టు కోవటానికి సరిపోయాయి. మరలా పంట చేతి కొస్తే తప్ప చేతిలో ఏగాణీ మిగలదు.

తనింట్లోంచి తొలగినందుకు పొలం పంపకాల్లో అరెకరం ఆదనంగా తన అన్న ఇచ్చాడు. వాడినేం అనటానికి వీలులేదు. చదువుకు అప్పు చెయ్యా ల్సిన పరిస్థితి వస్తుంది. క్రితం నాలుగైదు సంవత్సరాల్లో పంటలు సరిగా చేతి కందలేదు. తుఫానులకీ, మురుగుకీ పంట గురయ్యింది.

లంక మేతకీ, ఏటి ఈతకీ సరిపోయినట్లు వ్యవసాయం ఖర్చులకీ, వచ్చే రాబడికీ సున్నాకి సున్నాగా మిగిలింది.

బక్కగా ఉండే తనలాంటి వాళ్ళు ఈ కష్టాల్లో సతమతమై చస్తుంటే మధ్యలో ఈ బెడద. అయినా తప్పదు. నెలలో ఎప్పుడూ వెన్నెలుండ వట్టే—బ్రతుకులో అంతా రాబడి ఉండదు. కష్టాలు, సుఖాలు కావడి కుండలు. వెలుతురూ చీకటి లాగానే—రక్షించే దేవుళ్ళూ, భక్షించే భూతాలూ ఉండటం సహజం కాబోలు.

వెంటనే సాంబిరెడ్డి మనసు మరలా అనుకుంది.

రక్షించే దేవుళ్ళు...

అవును. తనింట్లో వెంకటేశ్వరస్వామి పటం ఉంది. ఆంజనేయస్వామి పటం ఉంది. తనింట్లోకి చేరేప్పుడు దేవుడికి ప్రసాదం సమర్పించుకుని మరీ చేరాడు.

ఆ దేవుళ్ళు తన నిప్పుడేం రక్షించలేరా?

ఒక్క మాకాలయ్యకు మాత్రమే అవి లొంగు తాయా?

కాస్సేపు సాంబిరెడ్డి కయోమయ మయ్యింది. అర్థంకాని పరిస్థితిగా మారింది. సమాధానం దొరకలేదు.

'ఏమిటింకా ఆలోచన—వెళ్ళి రమ్మంటుంటే?' రమణమ్మ కసిరింది. సాంబిరెడ్డి ఆలోచనల నుంచి తేరుకుని మామూలు ప్రపంచంలోకి

ఇది మీకు చాలాఉపయోగం

మీ నిత్యవ్యవహారాలకు 'వ్యవహారదర్శిని' అనే తెలుగుపుస్తకం మీకు చాలా ఉపయోగం. అందులో ఏదైనా ఆస్తి కొనేటపుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, ఏదైనా ఉత్పత్తి, వ్యాపారం చేయాలంటే, దేనికె వరివద్ద ఎలాంటి లైసెన్సు తీసుకోవాలి, వివిధ జాతుల వివాహ విడాకుల నిబంధనలు, స్త్రీపురుషుల ఆస్తి హక్కులు ఎవరితోనైనా ప్రమాదం రాబోతుంటే, పోలీసు రక్షణకు ఎవరికెలా వ్రాయాలి, ప్రభుత్వ ఉచిత యిండ్ల స్థలాలు పొందటానికి ఎవరికెలా ధరఖాస్తు వ్రాసి పంపుకోవాలి, నోట్లు దస్తావేజులు, ఒప్పందాల పత్రాలు, పిటీషన్లు, ఫిర్యాదులు, ఉత్తరాలు ఎలా వ్రాయాలి, వాటి వివిధ నమూనాలు, అనేక చట్టాల వివరాలు, ఇలాంటివెన్నో మీకుపయోగపడేలా, తెలిసేలా వ్రాయబడ్డాయి. 300 పేజీల పుస్తకం. ధర రూ. 12. పోష్టు ఖర్చు లదనం. దేశసేవ ప్రచురణాలు, 2. ఇందిరానగరు నెంగలరావునగరు టాంకు సమీపాన, హైదరాబాదు-890 కు ఉత్తరం వ్రాసి మీ ఉపయోగానికో పుస్తకం వి.పి. పోష్టుద్వారా వీలయినంత త్వరగా పొందండి

సరిక్రొత్త శక్తి యవ్వనమునకు సంప్రదించండి



నరముల బలహీనత, గుప్త రోగములు, చర్మ వ్యాధులు, మొలలు, సెక్స్ బలహీనతలకు ఉత్తమ చికిత్స చేయబడును. సంపూర్ణ ఆరోగ్యము సుఖ దాంపత్య జీవితమునకు పెండ్లి ముందు పెండ్లి తర్వాత సంప్రదించండి.

**Dr. Z. H. ROY (Govt. Regd.)**
**Dr. K. KESAVA RAO**
**(Ayurveda Praveena)**

ఆసియా క్లినిక్

సంధ్యాటాకీసు ఎదుట, R.T.C. X ROADS

హైద్రాబాద్-500 020 (ఆం. ప్ర.)

బ్రాంచి : నటరాజ్ టాకీస్ ఎదుట, నిజామాబాద్.

వచ్చాడు. కాలం అవసరాన్ని తీర్చుకుని, పై ఉత్తరీయాన్ని వేసుకుని మూకాలయ్య ఇంటికి చేరాడు!

● ● ● ●

మూకాలయ్య పూజలో ఉన్నాడు.

'కాస్సేపలా కూర్చో.' ఆయన భార్య అరుగు మీద చాపవేసింది.

మూకాలయ్యది నాలుగు దూలాల పెంకుటిల్లు. గచ్చు చేయబడి పరిశుభ్రంగా ఉంటుంది గోడలకు దేవుళ్ళ ఫోటోలన్నీ వరుసగా వ్రేలాడుతుంటయ్. అరుగుమీద కూర్చుని సాంబిరెడ్డి అన్ని ఫోటోల్నీ పరిశీలనగా చూశాడు. ఆంజనేయస్వామి, వెంకటేశ్వరస్వామి, దశావతారాలు, దుర్గామాత, విశ్వరూపం ఫోటోలూ, ఇంకా ఎన్నో ఉన్నాయి.

'ఇందరు దేవుళ్ళున్నా ఈ లోకాన్ని దయ్యాలు ఏడిపిస్తూనే ఉన్నయ్!' సాంబిరెడ్డి అనుకున్నాడు.

వంట గది ప్రత్యేకంగా ఇంటిముందు ఉంది. మూకాలయ్య మరదలు సావకార్చిన గుడ్లటొల్లల్ని వీధి ప్రక్క గుమ్మరించి ఇవతలి కొచ్చింది. ఖాళీ గుడ్లకోసం కాకులు పోట్లాడుకుంటూ దేని కందిందది ఎత్తుకుపోయింది. అందని కాకులు అందిన వాటి వెంట పడ్డాయి.

'తిండికోసం పక్షుల తిప్పలు—' సాంబిరెడ్డి అనుకున్నాడు.

అప్పు డతని మనసులో విచిత్రమైన వూహలు చోటు చేసుకున్నాయి.

పశువులకీ, పక్షులకీ ఈ భూతాల సంగతి తెలీదుగదా.

మనుష్యులు చస్తే మనిషి దయ్యాల్ని గురించి మనవాళ్ళు చెప్తారు గానీ, కాకులు చస్తే కాకి దయ్యాల్ని గురించీ, గేదెలు చస్తే గేదె దయ్యాల్ని గురించీ చెప్పలేదు—ఎందుచేతనో... చచ్చిన మనిషి భూతాలకి మాత్రం బ్రతికున్న పశువుల రక్తం కావాలి. బ్రతికిన కోళ్ళు బలిగా సమర్పించాలి. అయినా వాటిని చనిపోయిన భూతాలు తింటున్నాయా? బ్రతికిన మనిషే మరలా తింటున్నాడు.

ఏమిటో అంతా చిత్రం.

ఇప్పుడు తనకు కష్ట కాలమొచ్చింది . . .

మరలా సాంబిరెడ్డి మనసులోకి ఎందుకో కోడి గుడ్లు వచ్చాయి.

'మూకాలయ్యకు కోళ్ళు ఉన్నట్టు లేవు. గుడ్లు కొన్నాడు కాబోలు. రాత్రి తన ఇంట్లోని ఆ గుడ్లు భూతానికి ఆహారమైన సంగతి మరలా గుర్తుకు తెచ్చుకున్నాడు.

ఆకలి! బ్రతికున్నప్పుడు ఆకలి. చచ్చినా ఆకలే! బ్రతికిన మనిషి కంటే చచ్చిన తరవాతే నయమన్న మాట. భూతాలుగా మారి ఇలా తనలాంటి బక్కవాళ్ళను పీక్కుతినవచ్చు.

ఏ బ్రతికిన మనిషి వచ్చి కోడిగుడ్లు పెట్టమంటే తాను పెడతాడుగనుక?

ఏ బ్రతికిన మనిషి తన ఇంటి కొచ్చి 'నాకు మేకల్ని కోసిపెట్టు,' అంటే తను కోసిపెడతాడు గనుక? వెంట్రుకలు రూపాయలివ్వమంటే తను ఇస్తాడు గనుక?

ఆ చచ్చిన మనిషి ఎవరో తనకు తెలియదు. చనిపోయినాక భూత మెలా ఉంటుందో తనకు తెలియదు. కానీ, ఇప్పుడు తను ఆహారం పెడుతున్నాడు. మూకాలయ్య అందుకు మధ్యవర్తి.

ఇంతలో మూకాలయ్య బయటికొచ్చాడు. సాంబిరెడ్డిని చూసి చిన్నగా నవ్వాడు. రాత్రి మరేం జరుగలేదుగా అంటూ అడిగాడు.

లేదని సాంబిరెడ్డి సమాధానం చెప్పాడు.

'మంత్రమేశానుగా. మంత్రానికి పడని దయ్యమెక్కడుంటుందయ్యా! . . . మరి కార్యానికి సిద్ధమయ్యావా?'

'కానీండి—తప్పేదేముంది?'

'సాంబిరెడ్డీ, ఇది నాకేదో సర్దా అనుకుంటున్నావ్. లాభసాటి బేరమూ అనుకుంటున్నావు. భూతాలకి నేనంటే ఎంత కోపమో నీకేం తెలుసు. అవి లేని మనుష్యుల్ని తినటానికే ఇళ్ళలో జొరబడతాయి. వాటికి నరబలి కావాలి. ఇక మేం వాటితో కలబడి మంత్రం వేసి కోళ్ళు, మేకలతో సరిపెట్టి సంతృప్తి పరచి లొంగదీసుకోవాలి. తరవాత వాటిని అంతంచెయ్యాలి. ఈ పనుల్లో మాకు నిద్ర సరిగా ఉండదు. తిండి వేళకు ఉండదు. ఇల్లూ, వాకిలీ వదలి తిరిగివస్తుండాలి.

వాటిని గురించి భద్రపడి ఎప్పుడూ తిరుగుతుండాలి. కినుక వహించిన భూతాలు నన్ను పీక్కు తింటానికి ఎదురుచూస్తున్నయ్. ఒక విధంగా ఇదో పులి వేట లాంటిది, సాంబిరెడ్డీ!

దెబ్బతిన్న పులి వేటగాడిమీద కురుకుతుంది. నెత్తురు మరిగిన పులిని దెబ్బ తీయటం ఎంత కష్టమో నీకూ తెలుస్తుంది ఆలోచిస్తే—భూతాల వెంగాటం— ఎంత ప్రాణసంకటమో తలచుకుంటే ఒక్కొక్కప్పుడు నాకే భయం వేస్తుంది. అయినా తప్పటం లేదు . . ." మూకాలయ్య చెప్పుకుపోయే సమయంలో—

'ఇప్పుడివన్నీ ఎందుకండీ. తమర్ని కాదన్నానా?' సాంబిరెడ్డి కల్పించుకుని అన్నాడు.

'నువ్ కాదంటావని కాదు. అవసరం నీది. విషయం మాత్రం అది.' మూకాలయ్య చివరి మాటలు గట్టిగా అన్నాడు.

'ఇప్పుడు చెయ్యాల్సింది చెప్పండి. సిద్ధపడే వచ్చాను.'

మాటలు వినగానే మూకాలయ్య చిన్నగా నవ్వాడు. కాసేపు మౌనంగా శూన్యంలోకి చూశాడు. తరవాత

'రాత్రి చెప్పిందే—నాలుగుకోళ్ళూ, ఒక మేకపోతూ, వెయ్యి రూపాయలూ చూసుకో—ఈ రాత్రే పని మొదలెడదాం' అన్నాడు.

'అలాగే కానీయండి.' సాంబిరెడ్డి అన్నాడు.

● ● ● ●

ఆ రాత్రి మూకాలయ్య సాంబిరెడ్డి ఇంటికివచ్చాడు.

ఇంటి ముందు భాగంలో ఏవో రకరకాల ముగ్గుల్ని పెట్టాడు. అందులో కుంకుమ, పసుపు, సున్నం రంగుల్ని వాడి, భయం కొలిపే ఒక ఆకారాన్ని ఆ ముగ్గుల్లో తెచ్చాడు.

అక్కడో పీట వేసుకుని మంత్రాల్ని చదివాడు.


ఆ సమయాల్లో మూకాలయ్యతో అంతరంగికుడు ఎప్పుడూ ఉండేవాడు. వాడి పేరు బుర్రడు.

బుర్రడు పేరుకుతగ్గట్టు ఆకారం కలిగిఉంటాడు. నెత్తిమీద ఏం జబ్బు చేసి రాలిపోయేయో తెలియదు కానీ జుట్టుమొత్తం రాలిపోయింది. మీసాలు, గడ్డం స్థానంలో పెద్దగా వెంట్రుకలుండేవి కావు. నల్లటి మైనాన్ని ఎవరో శిల్పి నాజూగ్గా తయారు చేసిన తలలా వాడి తల ఉండేది. అక్కడక్కడ అడుక్కున్న చొక్కాలు వాడి శరీరం మీద వదులుగా ఉండేవి. అరలాగులు తొడుక్కునేవాడు.

ముఖం వెడల్పుగా ఉండేది. చప్పిడి ముక్కు క్రింది దూడపెదాలు వాడి ఆకారానికో ప్రత్యేకతను కూర్చి పెట్టాయి.

మూకాలయ్య అర్థం కాకుండా వాగే మంత్రాల్లోని ఆదేశాలు వాడు ఎప్పటికప్పుడు ఎదుటి మనుషులకు చెప్పేవాడు.

అటు మూకాలయ్య మంత్రాల్ని వాగుతుంటే ... బుర్రడు మధ్య మధ్యలో కల్పించుకుని కొబ్బరి



కాయలు తెమ్మనేవాడు. వారు తేగానే నూకాలయ్య కిచ్చేవాడు. నూకాలయ్య వాటిని కొట్టేవాడు. అలా నాలుగైదు కొబ్బరికాయలు పూర్తికాగానే 'అరకోళ్ళు' అంటూ అరిచేవాడు.

ఒకటి, రెండు కోళ్ళు తెగటంతో ఆవాటి తతంగం పూర్తయ్యేది. తెగిన కోళ్ళనీ, పగిలిన కొబ్బరి చిప్పల్నీ సంచిలో వేసుకుని బుర్రడు నూకాలయ్య వెంట వెళ్ళిపోయేవాడు.

ఆ విధంగానే ఆరోజు కూడా జరిగిపోయింది.

ఆ రోజు లాగా పది రోజులు జరిగిపోయాయి. అనుకున్న వాటికంటే మరో రెండు కోళ్ళు అదనంగా తెగాయి. ఆఖరురోజు మేకపోతు తెగింది. ఆ రోజు డబ్బు మొత్తంగా వసూలు చేసుకుని, భూతాన్ని ఊరు బయట పాతిపెట్టి నూకాలయ్య కార్యక్రమాన్ని ముగించాడు.

ముగించిన రోజున నూకాలయ్య సాంబిరెడ్డికో రహస్యాన్ని చెప్పాడు.

"ఈ భూతం చాలా ప్రమాదమయ్యింది. ఇది పూర్తిగా చావలేదు. చచ్చిపోయిందనే అనుకుంటున్నా. రేపెప్పుడైనా గట్టి వర్షాలు కురిస్తే ఇది మట్టిని పగలగొట్టుకుని మరలా బయటికి రావచ్చు. ఇది బయటికి రావడమంటే నీకు ఇంట్లో మరలా 'భోంవ్ ...భోంవ్ మనే శబ్దం వినిపిస్తుంది. అప్పుడు నాకు గుర్తు చెయ్యి. ఈ సారి దీన్ని పూర్తిగా చావగొడదాం."

సాంబిరెడ్డి సరేనన్నాడు. మొదటిసారే దాన్ని పూర్తిగా చావగొట్టనందుకు మనసులో కాస్త బాధపడ్డాడు.

• • • •

సాంబిరెడ్డి కా రాత్రి ఇంట్లో ఏ విధమైన శబ్దమూ వినిపించలేదు. అన్నిచోట్లలో నిలబడి చెవులు రిక్కించి మరీ విన్నాడు. శబ్దం వినపడలేదు.

తమను పట్టిన భూతం వదిలిపోయినందుకు ఇంటిల్లపాదీ సంతోషపడ్డారు. ఆదిలోనే కనుక్కొని దాన్నలా అణచివేయటంతో తమకు ప్రాణాపాయం తప్పిందని మురిసిపోయారు.

అంతా సవ్యంగా జరిగినా, సాంబిరెడ్డి మనసులో ఒక దిగులు అలాగే ఉండిపోయింది.

అది కొడుకు ఉత్తరం రాసినా ఇంతవరకూ డబ్బు పంపకపోవటం. అక్కడ వాడెంత బాధపడుతున్నాడోనని కూడా ఆలోచించకుండా, వాడి చదువు కంటూ కేటాయించిన మొత్తం సొమ్మును ఇలా భూతం ఖర్చుకు వినియోగించటం.

ఎక్కడ అప్పుచెయ్యాల్సిందీ తోచలేదు. అప్పు అడగటానికి ఏదో అభిమానం అడ్డు వచ్చింది. రమణమ్మ మెడలోని గొలుసూ, వనజ చేతికున్న రెండు గాజులూ సాంబిరెడ్డి మనసులో మెదిలాయి.

అవి తాకట్టు పెడితే ...

అదే మంచిదని. వాడి చదువుకు మించిందేంకుంది.

విషయాన్ని భార్యకు చెప్పాడు. ఆమె సరేనంది. ఎక్కడ పెట్టాలనే విషయంలో రెండు రోజులు తాత్సారం చేశాడు.

మార్వాడీ దగ్గర వడ్డీ ఎక్కువ. బాంకుల్లో ఎరుగుంటే తప్ప తీసుకోవటం లేదు.



ఫోటో - ఎల్. ఆర్. గ్రోవర్

ఈలోగా ఉమేష్ పట్నం నుంచి వచ్చాడు.

## 4

విషయం విన్న ఉమేష్ కాస్త ఆశ్చర్యపోయాడు. దెయ్యాలు, భూతాలు, చేతబడులూ ఇవన్నీ ఉత్త ఫార్సు. ఏమాత్రం నిజం లేదు. అమాయకుల్ని మోసంచేసే అభూత కల్పనలు.

ఈ దేశంలో కాస్త తెలిసిన ప్రతి మనిషి ప్రక్క వాడి అమాయకత్వంతో ఆడుకున్నాడు. అతని అజ్ఞానాన్ని కాష్ చేసుకున్నాడు. చేసుకుంటున్నాడు.

ఉమేష్ కున్న అభిప్రాయాలు,

ఏ మాంత్రికుడూ పట్టపగలు నడి బజారులో పదిమంది ఎదుటా ఒక దెయ్యాన్ని చూపించలేడు. ఏ భూతాల శాస్త్రవేత్త తన లేబొరేటరీలో ఒక మచ్చు భూతాన్ని కనీసంగా ఫోటో తీసైనా ప్రపంచానికి అందించలేదు. అంతా జేజమ్మలు, నాయనమ్మలు చెప్పిన కథల్నే ఆధారాలుగా చూపించారు.

ఈ దేశంలో రెండు వర్గాలున్నాయి.

ఒక వర్గం దేవుడ్ని సృష్టించింది. అది బాగా చదువుకున్న వర్గం. ఇక్కడ జరిగిన వారి కిష్టమైన చర్యలకు దైవత్వం రంగును పులిమారు! కానీ దేవుడ్ని మాత్రం నేరుగా చూపలేక పోయారు.

ఇక రెండో వర్గం. క్షుద్రవర్గం.

ఈ వర్గం భూతాల్ని, దెయ్యాల్ని సృష్టించింది. అమాయకుల్లో రేగిన ప్రతి భయాన్నీ వాటి కెర చేసింది. వాళ్ళ దగ్గర ఎన్నో లాభాల్ని గుంజింది.

ఉమేష్ కున్న మరి కొన్ని అభిప్రాయాలు.

ఎవరి మాటల్ని నమ్మాలి?

అత డప్పుడప్పు డాలోచించేవాడు.

సర్వ జీవరాశి చావు పుట్టుకలకు దేవుడే కారణమైతే... చనిపోయిన జీవులు దెయ్యాలుగా మారాల్సిన అవసరం ఎందుకుంటుంది?

సమాధానం దొరకని ప్రశ్న!

తండ్రికి కుటుంబం మీద ఎంతో బాధ్యత ఉంటుంది. కుటుంబంలోని ప్రతి సభ్యుని యోగక్షేమాలు ఆయనవిగానే ఉంటాయి. తన సంతానం మంచి చేస్తే సంతోషిస్తాడు. కానిపనులుచేస్తే ఆవేదన పడతాడు. క్షమిస్తాడు. ఎవరినీ శపించడు. కావాలని ఎవరి ఖర్మకు వాళ్ళను వదలడు. తన శక్తి వంచన లేని కృషిలో వారి జీవితాలు బాగుపడటానికి నిర్విరామంగా ప్రయత్నిస్తాడు. తన కుటుంబ సభ్యుల బాగోగుల్ని ఏ వెర్రి వెంగళప్ప చేతిలోనూ పెట్టడు. తన సంతానం చెడు స్నేహాల్ని అలవాటు చేసుకుంటుందని తెలిసినప్పుడు, ఆ చెడు ప్రభావం నుంచి తన వారిని తప్పిస్తాడు. వారి నిరంతాభ్యుదయంలో నిత్యం తను నైతికుడుగా, ఎక్కువిగా వ్యవహరిస్తాడు.

ఒక మంచి తండ్రి జీవన సరళి అది.

ఆ మంచి తండ్రి మనస్తత్వం కూడా ఈ సృష్టికర్తకు ఉండదా? ఉంటే తను సృష్టించిన ఈ ప్రపంచాన్ని ఈ భూతాల వారికి ఎందుకు ఎర చేస్తాడు?

దేవుడుంటే భూతా లుండకూడదు!

భూతాలుంటే దేవుడు లేనట్టే!

ఎవరు ఉన్నట్టు? ఎవరు లేనట్టు?

అనేకసార్లు ఉమేష్ అనుకుంటుండేవాడు. చిన్నగా నవ్వుకుంటుండేవాడు. ఇప్పుడు నూకాలయ్య మోసానికి తన కుటుంబం కూడా ఎర అయ్యింది. అయితే అమ్మ, నాన్నలు చెప్పేవాటికి మూలం?

ఉమేష్ ఆలోచించటం మొదలెశాడు.

చీకటిలో కనుపించని కళ్ళు ఏ పిల్లివో కావచ్చు. అది దూకేప్పుడు దాని కాళ్ళకు గొడ్డలి తగిలి తన తండ్రి మీద పడి ఉండవచ్చు! అప్పటికే వీరు భయంలో ఉన్నారు కాబట్టి ఆ జరిగింది వారి భయానికి మరింత బలాన్ని చేకూర్చవచ్చు.

ఇవే విషయాల్ని ఆ రాత్రి తండ్రీ, అమ్మ, చెల్లెలితో చెప్పాడు.

వాళ్ళు నమ్మలేదు.

రమణమ్మ ఒక ప్రశ్న వేసింది.

"ఆయినప్పుడు నూకాలయ్య కోడిగుడ్లు ఇంటి మీదుగా విసిరాడు. అవి అవతలికి పోయే సరికి చిన్న చిన్నవిభూది గడ్డల్లా మారాయి. దీనికేమంటావురా?"

"పిచ్చితల్లీ! నూకాలయ్య మోకాళ్ళ వరకూ ఉండే పదులైన చొక్కాను ధరిస్తాడు. అటూ ఇటూ ఉండే అతని జేబుల్లో ఆరు కిలోల ఏ పదార్థమైనా ఇమిడి పోతుంది. మీరిచ్చిన ఆరు గుడ్లూ ఒక జేబులో వేసుకుని, మరో జేబులో అంతకు ముందు నుంచీ ఉంచుకున్న చిన్న చిన్న విభూది గడ్డల్ని ఇంటి మీదుగా విసిరి ఉండవచ్చు. తెల్లవారాక మీరు వాటిని చూసి ఉండవచ్చు. మీ నోట్ల విభూతి గడ్డల్ని కొట్టి, ఆ తెల్లారిన రోజున ఆయన చక్కగా ఆ గుడ్లను భోంచేసి ఉంటాడు."

ఉమేష్ అన్న మాటలకు సాంబిరెడ్డి కొంచం అనుమానం చెందాడు. ఆ మరునాడు తను పోయి నూకాలయ్య ఇంటి అరుగుల మీద కూర్చున్నప్పుడు,

2—6—82

ఆయన మరదలు గుడ్ల బొల్లిల్ని రోడ్డు పక్కన విసిరి పోయిన సంగతి గుర్తుకు వచ్చింది.

"మరా శబ్దం సంగతి... అది వింటుంటే భయం వేసిందిరా. నీకేం. నీవు పట్నంలో హాయిగా ఉన్నావు. ఆ కరెంటు వెలుతురులో ఏ దెయ్యాలూ రావు. మేం ఇక్కడ శ్మశానానికి దగ్గర్లో ఉన్నాం. ఏదో అయిపోయిం దయిపోయింది. నీకు నమ్మకంలేకుంటే పూరుకో. ఇప్పుడు హాయిగా నిద్రపోతున్నాం." రమణమ్మఅంది.

ఉమేష్‌కి ఎంత ఆలోచించినా ఆ శబ్ద మేమిటో అర్థం కాలేదు.

"అయినా మీరు నాకు కబురు చెయ్యకుండ ఎందుకీ తతంగమంతా పెట్టుకున్నారు?" ప్రశ్నించాడు.

"ఎందుకురా నీకు కబురు? నువ్వంటే అసల ఏదీ సాగనిచ్చే వాడివి కాదు. ఆ భూతం నీ మీద కూడా పడేది." రమణమ్మ దిగులుగా అంది.

వనజ ఈ మాటలకు నవ్వింది. అమ్మ అమాయకత్వానికీ, తనమీద ప్రేమకీ ఉమేష్ శరీరం వింతగా పులకరించింది.

ఈ వ్యవహారం అంతా వింటూ సాంబిరెడ్డి మౌనంగా కూర్చుండిపోయాడు. అతనికేం అంతు పట్టటం లేదు.

'మరి భయంకొలిపే శబ్దం సంగతి? ఇప్పుడదెందుకు ఆగిపోయింది?' సమస్యగానే మిగిలిపోయింది! తక్కిన విషయాల్లో కొడుకు చెప్పిన యథార్థాలు కావచ్చు. నూకాలయ్య ఇంటిచూరు దగ్గరకు పోయి ఆ చీకట్లో భూతంతో పెనుగులాడటం, ఆ కాస్సేపు శబ్దం ఆగిపోవటం, భూతం తప్పించుకోగానే మరలా శబ్దం రావటం అన్నీ తాను కళ్ళారా చూశారాయె. ఇన్నింటికి సమాధానాలు చెప్పిన వాడు ఆ శబ్దం సంగతి అడిగితే మెదలకుండా ఉండిపోయాడేం? ...

ఎవరికి తోచింది వాళ్ళు చెప్పటం సహజం.

చీకట్లో జడలు విరబోసుకున్న దెయ్యాన్ని నేను చూశానని ఎవడైనా చెబితే అది తాటి చెట్టు ఎందుకు కాకూడదు? అంటూ విన్న వాడు కొట్టి పారవేయవచ్చు. చీకట్లో వాడి బాధ విన్నవాడికేం తెలుస్తుంది?

సాంబిరెడ్డి అనుకున్నాడు:


వెంటనే అతని మనసులోకి మరో విరుద్ధమైన ఆలోచన వచ్చింది.

అవునూ ... చీకట్లోనే దెయ్యాలు ఎందుకు కనపడతాయి? పగలవి ఎక్కడ ఉంటాయి. పగలు వాటికీ భయమేనా? వెలుగును చూసి భయపడే వాటిని చూసి మనుష్యులు చీకట్లో భయపడుతున్నారా? అర్థంకాని చీకటే దెయ్యమా? మరీ శబ్దాలూ??

ఆయన మనసుకి సమాధానం దొరకలేదు.

సాంబిరెడ్డి మనస్సు—కప్ప కాస్సేపు నీటిలోనూ, కాస్సేపు నేల మీదా తిరిగినట్టు—ఉభయచరంలా ఊగిపోతుంది. ఏది సత్యం? ఏ దసత్యం?

ఉమేష్ కోడిగుడ్ల సంగతి వివరించాక ఆయనికి అయోమయం మయ్యింది. నిజంగా అక్కడే భూతం




ఉంటే కోడిగుడ్డును పూర్తిగా మింగెయ్యాలి. దాన్ని విభూది గుడ్డగా మార్చి అవతలికి విసరాల్సిన అవసరం ఎందుకుంటుంది?

నూకాలయ్య విసిరింది విభూది గుడ్లేనా? అయినా ఆరు కోడిగుడ్లకు ఆయన ఎందుకు కాశ పడతాడు?

ఆశ కాకపోవచ్చు. అందులో ఉన్న రహస్యం ... తనను గట్టిగా నమ్మించే ప్రయత్నంలో అదొక భాగమేమో!

సాంబిరెడ్డికి భూతం వదిలినా సందిగ్ధం పట్టుకుంది.

'భోంయ్... భోంయ్...' శబ్దం తరచూ గుర్తుకు వస్తుంది. అదేమిటో వివరించలేని కొడుకు అసక్తతను గమనించాక ఆయన పరిస్థితి మరింత అయోమయ మయ్యింది.

## 5

ఉమేష్ రెండు రోజులు ఇంటి దగ్గరే ఉండిపోయాడు.

రెండో రోజు సాయంత్రం ఇంటి ముందు కుర్చీ వేసుకుని ఏదో మాగజైన్ చదువుతూ కాలక్షేపం చేశాడు. తర్వాత అతని దృష్టి అనుకోకుండా ఇంటి చూరుమీదికి మళ్ళింది.

ఇంటి చూరు క్రింద అడ్డంగా వరండాకు పొడవునా ఒక పెద్ద వాసం ఉంది. తమ ఇల్లు తూర్పు ముఖంగా ఉండటంతో వాసం దక్షిణం వైపుకీ, ఉత్తరం వైపుకి పరుచుకుని ఉంది. అది పై వాసాల కాధారంగా ఉంది.

ఆ వాసాని కున్న బొంగును మూస్తూ ఏదో మట్టి ముద్ద కనపడుతుంది. అది ఎండిపోయి నల్లగా కనిపిస్తుంది.

ఉమేష్ మనసులో ఏదో మెరుపులా ఆలోచన వచ్చింది. లేచి వెంటనే అక్కడికి పోయాడు. దానిలో ఉన్న మట్టి ముద్దను పూర్తిగా లాగాడు. సరిగ్గా కణుపు దగ్గర కోయటంతో అవతలి కణుపువరకూ బొంగు చాలా పొడవుగా ఉంది.

ఉమేష్ అలా మట్టిని తీయగానే బొంగులోకి గాలి పోవటం మొదలేసింది.

'భోంయ్ ... భోంయ్ ఒకటే శబ్దం. గాలి పెద్దగా లేకపోవటంతో శబ్దం మెల్లగా వస్తుంది. గాలి పెద్దగా వీచినప్పుడు శబ్దంగా కూడా పెద్దగానే వచ్చి ఉండాలి.

ఉమేష్ ఒక్కసారి పెద్దగా ఆశ్చర్యపోయాడు.

తల్లినీ, తండ్రినీ, చెల్లెల్నీ పిలిచి 'ఈ మట్టి ఈ బొంగులో ఎవరు పెట్టారని ప్రశ్నించాడు. ముగ్గురు మాకేం తెలియదని సమాధానం చెప్పారు. ఒక్కొక్కరూ వచ్చి అక్కడి శబ్దాన్ని గమనించమన్నాడు. ముగ్గురూ విన్నారు.

అదే శబ్దం.

భోంవ్ ... భోంవ్ ... భోంవ్ ...

వారంతా ఎలా తెలా పోయారు.

ఆదే సమయంలో సాంబిరెడ్డికి నూకాలయ్య చివరి రోజు మాటలు గుర్తుకువచ్చాయి.

'ఈ భూతం చాలా ప్రమాదమైనది. ఇది పూర్తిగా చావలేదు... రేపెప్పుడైనా గట్టి వర్షం పడితే మట్టిని పగులగొట్టుకుని మరలా ఇది బయటకు రావచ్చు! ఇది బయటికి రావడమంటే మరలా నీకు ఇంట్లో 'భోంయ్—భోంయ్' మనే శబ్దం వినిపిస్తుంది.' చీకట్లో నూకాలయ్య ఎంత చేసింది వరుసాగ్గా సాంబిరెడ్డి మననం చేసుకున్నాడు.

"ఇప్పుడు చెప్పండి ఇది భూతమంటారా? ఈ వాసానికి బొంగు ఉండటమూ, అది కాస్త ఎత్తుగా ఉండటమూ ఈ శబ్దానికి కారణమయ్యింది. ఈ చిన్ని విషయం మనకు తెలీకపోయేసరికి నూకాలయ్య పెద్ద నాటకమాడాడు. మన ఇంటి ముంగిలి మట్టి మన ఇంటికే రాసి పదిహేను వందల రూపాయలదాకా మనచేత ఖర్చు చేయించాడు. అతని మోసానికన్నా మనం ఆశ్చర్యపడాల్సింది — మనకున్న తెలివితక్కువతనానికి ..."

ఉమేష్ చెప్పుకుంటూ పోతున్నాడు.

గట్టి వర్షానికి ఆ మట్టి కరిగిపోయే ప్రమాదమూ తరవాత మరలా ఖర్చు ప్రమాదమూ తప్పినందుకు చెమటలు పోసి ఆ ఆశ్చర్యాల మధ్య కాస్తంత శాంతాన్ని కూడా సాంబిరెడ్డి అనుభవించాడు.

రమణమ్మకు తూలొచ్చి క్రిందకు చతికిలపడింది

*